క్లుప్తంగా

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



డాక్టర్ వసంత దాసరి

అక్కిరెడ్డిపాలెం: మహిళలు పనులతో పాటు ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ వసంత దాసరి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆస్పత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. గర్భిణులు, బాలింతల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బాల్యం, యుక్త వయస్సు, కౌమార దశ, పిల్లలు పుట్టే వయస్సు, మెనోపాజ్ వంటి దశల్లో మహిళలు పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు.

క్రైస్తవుల హక్కుల రక్షణకు కృషి



బాధ్యతలు స్వీకరిస్తున్న బిషప్ విజయరాజు

గాజువాక: అపోస్టోలిక్ ఆంగ్లికన్ కమ్యూనియన్ బిషప్ ప్రైమస్‌గా దువ్వాడకు చెందిన రెవరెండ్ విజయరాజు నియమితులయ్యారు. 30 దేశాల్లో మినిస్ట్రీ, చర్చి నాయకత్వాన్ని ఆయన పర్యవేక్షిస్తున్నారు. ఈ మేరకు అమెరికాలోని నాక్స్‌విల్, టెన్నెసీలో ఇటీవల ఆయనకు బాధ్యతలు అప్పగించారు. క్రైస్తవ విశ్వాసం, మానవ హక్కుల పరిరక్షణలో నాయకత్వాన్ని గుర్తించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలువురిని అల్పాహారానికి ఆహ్వానించారని, తనకు కూడా ఆ అవకాశం దక్కిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. క్రైస్తవుల హక్కులను రక్షించడానికి కృషి చేస్తానని తెలిపారు.

పారిశ్రామిక సదస్సులతో నైపుణ్యాభివృద్ధి



బహుమతులు అందిస్తున్న అతిథులు

అగనంపూడి: నైపుణ్యాభివృద్ధికి జాతీయ స్థాయి పారిశ్రామిక సదస్సులు దోహదపడతాయని యంగ్ ఇండియా నేషనల్ కో–చైర్మన్ ప్రదీప్ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ మీట్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు తదితరులు వివిధ ప్రదర్శనలు, పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు అన్యాయం



స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద ఆందోళన చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

పెదగంట్యాడ: రాత్రికి రాత్రే 270 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం అన్యాయమని స్టీల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును నిరసిస్తూ స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. నాయకులు మాట్లాడుతూ లేబర్ కమిషనర్ వద్ద చేసుకున్న ఒప్పందాన్ని తుంగలో తొక్కారన్నారు. స్టీల్ యాజమాన్యం ప్రశ్నించే నాయకుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందన్నారు. కార్యక్రమంలో వంశీకృష్ణ యాదవ్, నమ్మి రమణ, మంత్రి రవి, ఉరుకూటి అప్పారావు, పితాని భాస్కరరావు, దేవర అప్పారావు పాల్గొన్నారు.

అవనిలో సగం ఆమె. ఆకాశంలో సగం ఆమె.
అభివృద్ధిలో సగం ఆమె. అన్నింటా ఆమె...!!

మహిళలు నింగి నుంచి నేల వరకూ ప్రతి రంగంలోనూ సత్తా చాటుతున్నారు. నాయకత్వ ప్రతిభను చూపిస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. కొన్నేళ్ల కిందట వరకూ మహిళా దినోత్సవం అంటే మహిళను గౌరవిద్దాం అనే భావనతో నిర్వహించేవారు. ఇప్పుడు మహిళా దినోత్సవ వేడుకల పరిధి మారింది. స్త్రీలు సాధించిన అభివృద్ధి.. వారి అసమాన ప్రతిభ గుర్తించి వారికి కూడా పురుషులతో సమాన స్థాయి ఇవ్వండి అనే నినాదంతో మహిళాదినోత్సవం జరుపుకోవడం శుభపరిణామం.. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా...

– గాజువాక

ఇదీ మహిళా దినోత్సవ ఉద్దేశం

ప్రపంచవ్యాప్తంగా మహిళలు, బాలికల హక్కులను రక్షించడమే లక్ష్యంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తారు. మహిళలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యల గురించి వేదికలపై చర్చిస్తారు. మహిళల విజయాలను గుర్తించి వాటిని తెరపైకి తీసుకొస్తూ సత్కరిస్తారు. వారిని ఆదర్శంగా చూపిస్తూ విజయవంతంగా.. భయం లేకుండా.. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ముందుకు ఎలా వెళ్లాలో అవగాహన కల్పిస్తారు. ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్న మహిళలకు దక్కాల్సిన చట్టాలు, భద్రత ఏమిటో అవగాహన కల్పిస్తారు. ఆరోగ్య జాగ్రత్తలు, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడటంతో పాటు **బాలికలకు చదువు ఎంత ముఖ్యమో చాటి చెబుతారు.**



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పి.హేమలత (ఫైల్)

అన్నింటా ఆమె

కుటుంబ సారథ్యం నుంచి నాయకత్వం వరకు..

ప్రోత్సహిస్తే పురుషుడితో సమాన ప్రతిభ

మారాల్సింది సామాజిక దృక్పథమే



నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

మహిళ పాత్ర అనిర్వచనీయం



పిల్లలను మంచి వ్యక్తిత్వం గల పౌరులుగా తీర్చిదిద్దడంలో మహిళ పాత్ర అనిర్వచనీయం. విద్య, వైజ్ఞాన, శాస్త్ర, సాంకేతిక, క్రీడా, రాజకీయరంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంది. తమ ప్రతిభతో మహిళలు అన్ని రంగాల్లో విజయవంతంగా దూసుకుపోతున్నారు. కుటుంబ వ్యవస్థలో భార్యను తమ కుటుంబంలో కలుపుకుపోవడానికి భర్త కూడా ప్రయత్నం చేయాలి. ఒకర్ని ఒకరు అర్థం చేసుకొని అభిప్రాయాలను పరస్పరం గౌరవిస్తూ ముందుకు సాగాలి. వైద్యరంగం, పరిపాలన, ఇతర రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న మహిళలు కూడా అత్త, భర్త వల్ల వేధింపులకు గురవుతున్న పరిస్థితులున్నాయి. అయినప్పటికీ వారు తమ వృత్తిలో విశేషంగా రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

– డాక్టర్ పి.హేమలత, వైద్యాధికారి, పెదగంట్యాడ పీహెచ్‌సీ

నిర్ణయాలు తీసుకొనే స్థాయికి ఎదగాలి



సమాజంలో చాలా మంది మహిళలు వేధింపులు, అవమానాలకు గురవుతున్నారు. పని ప్రదేశాల్లో మహిళలు లైంగిక వేధింపులకు గురవుతున్నారు. వాటిని బయటకు తెలియపరిస్తే పరిస్థితులు ఎలా ఉంటయోననే భయంతో ఎక్కువ మంది చెప్పుకోలేకపోతున్నారు. మహిళలు స్వయంగా నిర్ణయం తీసుకొనే శక్తిని కలిగి ఉండాలి. ఉద్యోగాలు చేసే మహిళలు ఇంట్లో, ఆఫీసుల్లో బ్యాలెన్సింగ్‌గా పని చేయాలి. ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే మహిళలకు నిజమైన స్వేచ్ఛ లభిస్తుంది. ఆర్థిక స్వేచ్ఛ వచ్చిందని దాన్ని దుర్వినియోగం చేయకుండా ముందకు సాగాలి. కుటుంబంలో, సమాజంలో చైతన్యవంతంగా తమ పాత్రను పోషించినప్పుడే అన్ని రంగాల్లోనూ రాణిస్తారు.

– ఎస్.చంద్ర మహాలక్ష్మి, ప్రిన్సిపాల్, చైతన్య మహిళా డిగ్రీ, పీజీ కళాశాల

ప్రతి మహిళ ఒక అద్భుతం



తాను ఒక అద్భుతమనే విషయాన్ని ప్రతి మహిళా నమ్మాలి. తన శక్తి సామర్థ్యాలను తనే తెలుసుకోవాలి. భారతీయ కుటుంబ వ్యవస్థలో మహిళల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వారిపై అంచనాలు కూడా చాలా ఎక్కువగా ఉంటాయి. ఒక అమ్మాయిగా, అమ్మగా, గృహిణిగా, ఉద్యోగిగా, వ్యాపారవేత్తగా అనేక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగల సత్తా ఉంది. ఎటువంటి ప్రతిఫలం లేకుండా ఇన్ని బాధ్యతలను నిర్వహిస్తున్న మహిళల గురించి చెప్పుకోవడానికి ఈ ఒక్కరోజు సరిపోదు. నేడు మహిళలు ప్రతి రంగంలో ముందుకు వెళ్తున్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతి మహిళ ఉన్నతమైన ఆలోచనలతో కుటుంబానికి, ఉద్యోగం, వృత్తికి సమానమైన ప్రాధాన్యం ఇచ్చి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి.

– టి.శ్రీవల్లి, గాజువాక తహసీల్దార్

సమాన అవకాశాలు కల్పించాలి



ప్రతి మహిళ ఒక మేనేజ్‌మెంట్ లక్షణం కలిగి ఉంటుంది. భార్యగా, తల్లిగా ఒంటి చేత్తో కుటుంబాన్ని నడిపిస్తుంది. ఎన్నో పనులను సులభంగా చేస్తుంది. చైనాలో మహిళలకు గుండు సూదుల నుంచి అంతరిక్షం వరకూ అన్ని రంగాల్లో ప్రాధాన్యం కల్పిస్తున్నారు. అందుకే ఒకప్పుడు మనకన్నా వెనుకబడి ఉన్న ఆ దేశం ఇప్పుడు ప్రపంచదేశాలను శాసించే స్థాయికి ఎదిగింది. మనదేశంలో కూడా మహిళలకు అన్నిరంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలి. చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్‌ను 50 శాతానికి పెంచాలి.

– కె.సీతామహలక్ష్మి, న్యాయవాది

పురుషుల సహకారం పెరుగుతోంది



ప్రస్తుత ప్రపంచంలో మహిళలపట్ల కొంత అణచివేత ఉన్నప్పటికీ క్రమంగా పురుషుల్లో అభిప్రాయాలు మారుతున్నాయి. మహిళలు అన్ని రంగాల్లోను మంచి ప్రతిభ కనబర్చడం, అభివృద్ధి పథంలో పయనించడం దీనికి కారణంగా చెప్పొచ్చు. తమకు జన్మించే అమ్మాయిలను కూడా అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలన్న తపన తల్లిదండ్రుల్లో కూడా బాగా పెరిగింది. దానికి నన్ను కూడా ఉదాహరణగా చెప్పొచ్చు. నా తల్లిదండ్రులు నన్ను బహుముఖంగా అభివృద్ధి చేశారు. ఒక పక్క నన్ను ఇంజనీరింగ్ చదివించారు. మరోపక్క కూచిపూడి నాట్యం నేర్పించడంతోపాటు నాట్య శిక్షణాలయం స్థాపించే విధంగా ప్రోత్సహించారు. వారి పోత్సహంవల్లే నేను ఇండియన్ అచీవర్స్ అవార్డు సాధించగలిగాను. దేశ, విదేశాల్లో ఎన్నో నాట్య ప్రదర్శనలు చేయగలిగాను. ప్రస్తుతం చదువులోను, ఉద్యోగాల్లో కూడా పురుషులకంటే మహిళలు ముందువరసలో ఉండటం మనం చూస్తున్నాం. దీన్ని అందరూ ఆహ్వానించాలి. ప్రోత్సహించాలి.

– వై.నిషిత యుగేష్, నాట్య గురువు

మహిళలకు అగ్రస్థానం కల్పించాలి

పెదగంట్యాడ: సమాజంలో మహిళలకు అగ్రస్థానం కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడి, గాజువాక వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక టీఎన్నార్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమానికి వారు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే విప్లవాత్మకమైన పురోగతిని సాధించడంలో మహిళలు ముందున్నారన్నారు. వారికి మరింత ప్రోత్సాహం అందిస్తే ఇంకా అభివృద్ధి సాధిస్తారని అభిప్రాయపడ్డారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పేడాడ రమణకుమారి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఉండేదన్నారు. ఈ సందర్భంగా కేక్‌ట్ చేసి సంబరాలు చేశారు. పలువురి మహిళలను సత్కరించారు. గాజువాక నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పల్లా చినతల్లి అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ హేమలత, సంఘ సేవకురాలు కె. జమునా రాణి, మాజీ కార్పొరేటర్ తిప్పల ఎమిలి జ్వాల, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, భూపతిరాజు సుజాత , కొయ్య భారతి, మార్డుపూడి పరదేశి, ధర్మాల శ్రీను, మంత్రి శంకర నారాయణ, ఎండీ గౌస్, రోజారాణి, లావణ్య, పల్లా పెంటారావు పాల్గొన్నారు.

అగనంపూడి: చట్టం దృష్టిలో స్త్రీ, పురుషులు సమానమే.. ఎవరి హక్కులు వారికి ఉంటాయని జిల్లా విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యురాలు జి.మాధవి అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఫార్మా కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, కమల కుమారి పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కణితిపాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థినులకు పోటీలు నిర్వహించారు. విజేతలకు మ్యాజిక్ బస్ ప్రతినిధులు సురేంద్ర కుమార్, నాగమణి, భవాని బహుమతులు అందించారు.

ఉక్కునగరం: స్థానిక విశాఖ విమల విద్యాలయం (వీవీవీ)లో మహిళా ఉపాధ్యాయులు, సిబ్బందిని జేవీవీ జోనల్ అధ్యక్షుడు ప్రసాద్, వెంకటరాజు, స్టాఫ్ సెక్రటరీ సత్యనారాయణ సన్మానించారు.



కేక్ కట్ చేస్తున్న రమణకుమారి,చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు నాగిరెడ్డి, గురుమూర్తిరెడ్డి, గాజువాక వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి



బహుమతులు అందుకున్న కణితిపాఠశాల విద్యార్థినులు



సన్మానం అందుకున్న మహిళా ఉపాధ్యాయులు, సిబ్బంది

పీఎఫ్ యాజమాన్యానికి రికార్డుల అందజేత



రికార్డులను పీఎఫ్ అధికారులకు అందజేస్తున్న గుర్తింపు యూనియన్ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ/భెల్ (హెచ్‌పీవీపీ) యూనిట్‌లో ఉద్యోగులు, కార్మికుల పీఎఫ్ రికార్డులను పీఎఫ్ ఎంక్వైరీ ఆఫీసర్ శేషగిరిరావుకు భెల్ సీనియర్ మేనేజర్ (హెచ్‌ఆర్) సమక్షంలో శుక్రవారం గుర్తింపు యూనియన్ సంయుక్త గౌరవ అధ్యక్షుడు కొల్లి దేముడు, అధ్యక్షుడు బొండ బాబూరావు అందజేశారు. గుర్తింపు యూనియర్ ప్రతినిధులు మాట్లాడుతూ పలువురు ఉద్యోగులు, కార్మికులకు సంబంధించిన డేట్ ఆఫ్ జాయినింగ్ 1992 సంవత్సరానికి గానూ 1997గా.. మరి కొంత మందికి 2011గా నమోదైందని తెలిపారు. దీంతో ఉద్యోగులు, కార్మికులు పీఎఫ్ అంశంలో తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. వాటిని సరిదిద్దాలని పలుమార్లు గుర్తింపు యూనియన్ ప్రతినిధులు పీఎఫ్ యాజమాన్యంతో చర్చలు జరినడంతో పీఎఫ్ యాజమాన్యం రికార్డులు సమర్పించాలని కోరింది. దీంతో గుర్తింపు యూనియన్ ప్రతినిధులు సంబంధిత రికార్డులను సంస్థ సీనియర్ మేనేజర్ సమక్షంలో పీఎఫ్ విచారణ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు సుభాకర్ సాహూ, పి.వి.ఎస్.రాజు, టిక్కలి భాస్కరరావు, పి.వీరబాబు, బి.రవీంద్రబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



నుజ్జు నుజ్జు అయిన కారు

కూర్మన్నపాలెం: వడ్లపూడి జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. వడ్లపూడి నుంచి రహదారిపై మలుపు తిరుగుతున్న కారును కూర్మన్నపాలెం నుంచి గాజువాక వైపు వస్తున్న టాటా ఏస్ బలంగా ఢీకొంది. దీంతో కారు డివైడర్ ఎక్కి నుజ్జునుజ్జు అయిపోయింది. కారు నడుపుతున్న వ్యక్తి గాయపడ్డాడు. అతన్ని వడ్లపూడి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాల క్రమబద్ధీకరణ



తహసీల్దార్ అమల

పెదగంట్యాడ: ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టి నివాసం ఉంటున్న వారు వాటిని క్రమబద్ధీకరణ చేసుకోవాలని పెదగంట్యాడ తహసీల్దార్ పి.అమల కోరారు. తన కార్యాలయంలో శుక్రవారం విలేకరుల తో మాట్లాడారు. 2019 అక్టోబర్ 10కి ముందు కొండపోరంబోకు తదితర స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని ఇంటి పన్ను, కరెంటు బిల్లు చెల్లిస్తున్న వారు క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని చెప్పారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

అది ప్రభుత్వ భూమే : కాగా దయాల్‌నగర్‌లోని సర్వే నెంబర్ 43/1లో భూమంతా ప్రభుత్వానికి చెందినదేనని ఆమె వెల్లడించారు. ఇక నుంచి ఆ భూములు ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డిజిటల్ బోర్డుల ఏర్పాటు

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌లో రాత్రి వేళల్లో వివిధ పరిశ్రమలకు వచ్చే లారీల డ్రైవర్లు బ్లాకులకు వెళ్లేందుకు ఇబ్బందిపడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించే దిశంగా ఏపీఐఐసీ కమిటీ ఆటోనగర్ ప్రవేశ ద్వారం వద్ద, శ్రీనగర్ నుంచి ఆటోనగర్‌లోకి ప్రవేశించే ముందు ఎలక్ట్రికల్ డిజిటల్ సైన్ బోర్డులు ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో ఐలా కమిషనర్ కిశోర్, చైర్మన్ కె.సత్యనారాయణ (రఘు), వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, ప్రధానకార్యదర్శి చీకటి సత్యనారాయణ పాల్గొన్నారు.



ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డు



శ్రీనగర్ ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన సైన్ బోర్డు